


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

“**చెప్తాను.** మిగిలిన డివిజన్లతో పాటు మా ఝాన్సీ రాణి రెజిమెంట్ కూడా మెజారిటీ సైనికులను బర్మాకు పంపింది. నేను, మధుబాల, చేవా బర్మాకు వెళ్ళిన వాళ్లలో ఉన్నాము. అదే సమయంలో సుభాస్ చంద్ర బోస్ తన మిలటరీలో ఎన్నో సంస్కరణలు తెచ్చాడు. బ్రిటిషు వారు 1857 సైనికుల తిరుగుబాటు తరువాత మరోసారి సైన్యంలో అలాంటి తిరుగుబాటు రాకుండా కులాల వారీగా, ప్రాంతాల వారీగా, జాతుల వారీగా సైన్యాన్ని విడగొట్టారు. ఉదాహరణకు సిక్ రెజిమెంట్, డోగ్రా రెజిమెంట్, కుమాయూన్ రెజిమెంట్, గర్వాలీ రెజిమెంట్, రాజ్‌పూత్ రెజిమెంట్, అహిర్ రెజిమెంట్, గూర్ఖా రెజిమెంట్... ఇలా సైన్యాన్ని కూడా విడగొట్టారు. అదే సుభాస్ తన సైన్యంలో ఇలాంటి విధానాలకు మంగళం పాడాడు. తన సైన్యంలో రెజిమెంట్లకు దేశభక్తుల పేర్లు పెట్టాడు. సైన్యానికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేకపోవటంతో వారికి కేవలం పాకెట్ మనీ ఇచ్చేవాడు. ఎప్పుడూ తప్పుడు వాగ్దానాలు చేయలేదు. భ్రమలు కల్పించలేదు. మీ బలిదానాలతోనే స్వాతంత్రం వస్తుందని శషబిషలు లేకుండా చెప్పాడు. అయినా ఎవరూ సైన్యాన్ని వదిలి వెళ్లలేదంటే కారణం ఆయన మీద ఉన్న నమ్మకం, గౌరవం. వీరికి జపాను వారు చేసిన సాయం అంటే... గోధుమ పిండి, పప్పులు, నూనెలు లాంటి రేషన్ సప్లై చేసేవాళ్లు. కూరగాయలు, వంట సామాగ్రి సైన్యమే సమకూర్చుకునేది. ఇక ఆజాద్ హింద్ ఫౌజు వాడే ఆయుధాలు కూడా యుద్ధంలో శత్రువుల నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలే. అందుకే బోసు జపాను సాయాన్ని గొప్ప సాయంగా అభివర్ణించేవాడు కాదు. వారు ఎలానూ యుద్ధ ఖైదీలను పోషించవలసిందేగా. అదే ఇప్పుడూ చేస్తున్నారు. దానికి సాయం అని పేరు పెట్టలేను అని బహిరంగంగానే వాఖ్యానించేవాడు...”

“మేడం ఆయనకు అంత ధైర్యం ఎలా వచ్చింది?”

“అదే విచిత్రం. ఆయన ఎప్పుడూ జపాను వారి ముందు తల వంచలేదు. వారి మిలటరీ అధికారులయితే బోసు ముందుకు రావాలంటే భయపడేవాళ్లు. అంత సూటిగా వారిని విమర్శించేవాడు బోస్. మిలటరీలో శౌర్యం ప్రదర్శించిన వారికి ఇచ్చే బిరుదులు కూడా బ్రిటిషు వారి నుండి అరువు తెచ్చుకున్న బిరుదులు కాకుండా...షహీన్–ఎ–భరత్, షేర్–ఎ–హింద్, సర్దార్–ఎ–జంగ్, షహీద్–ఎ–భరత్, వీర్–ఎ–హింద్ లాంటి హిందుస్తానీ పదాలతో బిరుదులు ప్రవేశ పెట్టాడు. మిలటరీని నడపటానికి అవసరమయిన ధనం కోసం కేవలం జపాను వారి మీద ఆధారపడకుండా, బ్రిటిషు వారి నుండి జపాను విముక్తి చేసిన సింగపూరు, మలేషియా, ఇండోనేషియా లాంటి దేశాలలో ఉన్న భారతీయులను సహాయం చేయమని అడిగేవాడు. వారి దగ్గర నుండి చందాల రూపంలో, పన్నుల రూపంలో డబ్బు వసూలు చేసి మిలటరీ అవసరాలకు ఖర్చు పెట్టేవాడు. ఇన్ని ఆర్థిక కష్టాల మధ్య జపాను, భారతదేశ ఉమ్మడి సైన్యం విజయవంతంగా బ్రిటిషు వారిని ఓడించి బర్మాని వశం చేసుకోగలిగింది. దానితో తన కార్య రంగాన్ని రంగూన్‌కి మార్చాడు బోస్.”

“అప్పుడు మీతో డోల్మా, ఫ్లోరెన్సులు కలిశారు. అంతేనా?”

“అవును. అదే జరిగింది. కాకపోతే వారిద్దరు మిలటరీలో కావాలని చేరలేదు. పరిస్థితుల ప్రభావంతో చేరాల్సి వచ్చింది.”

“మరి అలా ఇష్టం లేకుండా చేరిన వాళ్లు మనస్ఫూర్తిగా మీకు సహకరించారా?”

“నిజం చెప్పాలంటే రాణీ ఝాన్సీ రెజిమెంట్‌లో చేరే వాళ్లలో చాలామంది అలాంటి వాళ్లే. జీవితంలో విఫలమయిన వాళ్లు, ఎవరి మీదో కోపంతో చేరిన వాళ్లు, యుద్ధం అంటే ఆట అనుకున్న వాళ్లు... కాకపోతే చేరిన వారు ఎలాంటి వారయినా, అందరినీ దేశానికి ఉపయోగపడేలా తయారు చేసే శిక్షణ కార్యక్రమం ఉండేది. అక్కడ ఆడవారిని ఎవరూ, ఎప్పుడూ అబలలుగా చూడలేదు. ఒక్కొక్కరిలో ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుంది. దానిని వెలికితీసి ఉపయోగించుకోవటమే ఆజాద్ హింద్ ఫౌజ్ గొప్పతనం...” అంటూ మరోసారి అప్పటి జ్ఞాపకాలలో మునిగిపోయింది కాంచనమాల.

1944, మార్చి నెల...

రంగూన్‌లోని ఆజాద్ హింద్ ఫౌజు క్యాంపు...

కొత్తగా వచ్చిన ఇద్దరు అమ్మాయిలను రాణీ ఝాన్సీ రెజిమెంట్ కెప్టెన్ లక్ష్మి ముందుకు తీసుకు వచ్చారు. వారి గురించి బ్రీఫింగ్ ఇచ్చి, వారిని అక్కడ వదిలేసి వెళ్లిపోయారు.

వారిని అయిదు నిమిషాలు ఇంటర్వ్యూ చేసిన కెప్టెన్ లక్ష్మికి వారి మానసిక స్థితి అర్థమయింది.

“మీరు పెద్దగా చదువుకోలేదు. ఎలాంటి శిక్షణా లేదు. అడ్వెంచర్ మీద ఇష్టంతో ఇక్కడకు వచ్చారు తప్ప మీకంటూ ఒక ధ్యేయం లేదు. మీరు బలవంతంగా ఇక్కడ ఉండనవసరం లేదు. కావాలంటే మిమ్మల్ని మీ స్వంత ఊరుకు చేర్పించే ఏర్పాటు చేస్తాను...” అంది కెప్టెన్ లక్ష్మి తన ఇంటర్వ్యూ పూర్తి అయిన తరువాత.

టైగర్‌మోత్‌ని దొంగలించి గాలిలోకి ఎగిరిన సమయంలో డోల్మా, ఫ్లోరెన్సులకు తరువాత ఏం చేయాలన్న దాని మీద ఒక ఐడియా లేదు. వారి దృష్టిలో అదొక అడ్వెంచర్. అంతే! ఎలా ఎగిరారో అలానే దిగవచ్చు అని అనుకున్నారు. విమానాన్ని తిరిగి ఎయిర్‌ఫీల్డులో దింపేస్తే, ఏదో చిన్న పిల్లల చేష్ట అని తాము చేసిన పనిని ఎవరూ సీరియస్‌గా తీసుకోరని భావించారు. కానీ ఎప్పుడయితే విమానం నాశనం అయిపోయిందో, తాము చేసింది పెద్ద నేరం అని వారికి అర్థం అయింది. అత్యంత విలువయిన విమానాన్ని పాడు చేసినందుకు ఎయిర్‌ఫోర్స్ అధికారులు తమ మీద కోపంతో రగిలి పోతుంటారని అర్థం చేసుకున్నారు. అందుకే... తాము చేసిన పని పాతబడటానికి కనీసం కొన్ని నెలల సమయం పడుతుందని అంచనా వేసుకున్నారు. అప్పటివరకు ఇక్కడ గడిపి, కొన్ని నెలల తరువాత అవకాశం చూసుకుని తిరిగి తమ కొహిమాకు జంప్ అయిపోతే... ఇటు వీళ్ళు ఏమీ చెయ్యలేరు, అక్కడ వాళ్ళకు విషయం పాతబడి పోతుందన్నది అని వీళ్ల అభిప్రాయం.

అందుకే, “వద్దు మేడమ్! మేము మీతోనే ఉంటాము...” అన్నారు ఉమ్మడిగా.

కెప్టెన్ లక్ష్మి బెల్ కొట్టి, “కాంచనమాలను పిలవండి...” అంది.

కొన్ని నిమిషాల తరువాత వచ్చిన కాంచనమాలకు వీరి బాధ్యత అప్పచెప్పింది కెప్టెన్ లక్ష్మి.

రాణీ ఝాన్సీ రెజిమెంటులో ఉండేది అందరూ ఆడవారయినా శిక్షణ విషయంలో ఎలాంటి వెసులుబాటూ లేదు. మగవారితో సమంగా అందరూ శిక్షణ తీసుకోవలసిందే.

తెల్లవారుజామునే రోల్‌కాల్ కోసం లేపుతున్న వారి మీద విసుక్కుని మరలా పడుకుంది ఫ్లోరెన్స్. చెవులు పగిలేలా విజిల్ వేసుకుంటూ వచ్చిన ట్రైనర్ ఇంకా పడుకుని ఉన్న ఫ్లోరెన్స్‌ని చూసి మండి పడింది. “ఇదేమన్నా నీ ఇల్లనుకున్నావా? నేనేమన్నా నీ అమ్మని అనుకున్నావా? నీ గారం భరించటానికి... నీ క్రమశిక్షణా రాహిత్యానికి శిక్ష ఏంటో తెలుసా? మన ప్రోగ్రాం అయిన తరువాత అదనంగా గ్రౌండు చుట్టూ అయిదు రౌండ్లు పరుగెత్తాలి.” అంటూ పనిష్మెంటు ఇచ్చింది. అంతేకాదు, “రేపు నేను వచ్చేటప్పటికి గ్రౌండులో కాకుండా, మంచం మీద కనిపించావంటే పది సార్లు గ్రౌండు చుట్టూ పరుగెత్తిస్తాను...” అంది. అనటమే కాదు అమలు చేసింది కూడా.

సైన్యానికి కావలసింది క్రమశిక్షణ. తన పై అధికారి ఇచ్చిన ఆజ్ఞని మరో ఆలోచన లేకుండా అమలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే అందరూ ప్రమాదంలో పడవచ్చు. అందుకే శిక్షణ కఠోరంగా ఉంటుంది. చిన్న చిన్న తప్పులకు కూడా పెద్ద పెద్ద శిక్షలు ఉంటాయి.

టైముకు గ్రౌండుకు చేరటంతో పని చేసినట్లు కాదు. గంట సేపు ఆపకుండా వ్యాయామం చేయాలి. బరువులు వీపున వేసుకుని గ్రౌండు చుట్టూ రౌండ్లు కొట్టాలి. ఏదో ఒక వంక పెట్టి అదనపు రౌండ్లు పరుగెత్తమనే వాళ్ళు.

డోల్మాకు శారీరక శ్రమ అలవాటు కాబట్టి పెద్ద కష్టం అనిపించటం లేదు కానీ, ఫ్లోరెన్స్ ఈ కష్టాన్ని తట్టుకోలేక పోతోంది. కళ్లెమ్మట నీళ్ళు వస్తున్నాయి. అయినా పట్టించుకున్న వాళ్లు లేరు. ఆఖరికి డోల్మా కూడా ఆమె పక్కన ఉండటానికి కుదరటం లేదు. వారిద్దరినీ దూరంగా ఉంచుతున్నారు.

ప్రతిరోజు తొమ్మిది గంటల సమయంలో బ్రేక్‌ఫాస్ట్ కోసం విరామం ఇస్తారు. అప్పుడు మాత్రం డోల్మా, ఫ్లోరెన్స్ కలుసుకోగలుగుతున్నారు.

అక్కడ ఇచ్చిన బ్రేక్‌ఫాస్ట్ చూసి, "దిసీజ్ షిట్. నాకొద్దు..." అంది ఫ్లోరెన్స్.

"ఇది నాకు చాలదు. ఇంకాస్త పెట్టండి." కోపంగా అంది డోల్మా.

కాంచనమాల వచ్చి వారి పక్కన కూర్చుంది. అనునయంగా, "చూడు ఫ్లోరెన్స్... అసలు ఆహారం అంటూ లేక 30 లక్షల మంది ప్రజలు బెంగాలులో మరణించారు. దొరికిన ఆహారాన్ని అసహ్యించుకోకు. డోల్మా! నీకిచ్చిన ఆహారం చాలక పోతే, నాది కూడా తీసుకో..." అంది.

ఆ మాటలకు వారిద్దరు మెత్తబడ్డారు.

తరువాత కాంచనమాల వెళ్లి మధుబాల, చేవాల పక్కన కూర్చుంది.

"వాళ్లను చూస్తుంటే యుద్ధం చేయటానికి వచ్చినట్లు లేదు, యుద్ధం నుండి తప్పించుకుని వచ్చినట్లు ఉంది..." అంది జరిగే తతంగం అంతా చూస్తున్న మధుబాల.

"ఆ బ్రిటిషు అమ్మాయిని చూస్తుంటే మీకు ఏమీ అనుమానం రావటం లేదా? మనం మన గూఢచారులను భారతదేశంలోకి పంపినట్లు బ్రిటిషు వాళ్ళు ఈ ఇద్దరిని మన విషయాలు కనుక్కు రమ్మని పంపారేమో..." అంది చేవా.

చేవా మాటలు మధుబాల, కాంచనమాలను కూడా ఆలోచనలో పడవేశాయి.

మరికొన్ని రోజులు వారిని దగ్గరగా పరిశీలించాక, వారిద్దరిది అమాయకత్వమే అని నిర్ధారణకు వచ్చారు. వారి మీద ఒక కన్నేసి ఉండటానికి వీలుగా వారిని తమకు దగ్గరగా ఉంచుకునేది కాంచనమాల.

సరిగ్గా వారు గూఢచారులను గురించి మాట్లాడుకుంటున్న సమయంలో బోసు కూడా తను భారతదేశంలోకి పంపిన 130 మంది గూఢచారుల గురించి రివ్యూ చేస్తున్నాడు.

"మనం పంపిన గూఢచారులలో సగం మందికి పైగా ఏమయ్యారో తెలియదు. మిగిలిన వారి నుండి మాత్రం సందేశాలు వస్తున్నాయి..." చెప్పాడు కియానీ.

"గుడ్. కానీ మిగిలిన వారి నుండి ఎందుకు సందేశాలు రావటం లేదు?" అడిగాడు బోసు.

"బహుశా పోలీసులకు పట్టుబడ్డారేమో. ఇంకొంత మంది భారతదేశాన్ని, స్వంత ఊరిని చూడగానే ఇంత అపాయకరమయిన పని చేయటం ఎందుకని మానుకున్నారేమో..."

"నువు చెప్పిన మొదటి కారణం సరయినదిలా ఉంది. కానీ, రెండవ కారణాని నేను ఒప్పుకోను. నా మనుషుల్లో ఒకరు కూడా పిరికిపందలు లేరు."

"మీరు మనుషుల్ని నమ్మాల్సినదానికంటే ఎక్కువగా నమ్ముతారు..." అన్నాడు కియానీ.

అతని మాటలను దాటవేస్తూ, "బర్మా పూర్తిగా మన ఆధీనంలోకి వచ్చినట్లేనా?" అని అడిగాడు బోస్.

"నూటికి నూరు శాతం..."

"మరి ఇండియా సంగతి ఏమిటి? మన జపాను మిత్రులు ఎప్పుడు దాడి చేద్దామంటున్నారు?"

"బర్మాకు, ఇండియాకు చాలా తేడా ఉంది. ముందు అక్కడ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో తెలుసుకోవాలి. దాని గురించి మన గూఢచారులు పంపే సమాచారం కోసం ఎదురు చూస్తున్నాం."

బోసు అతని అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు తల ఊపాడు. తరువాత గంభీరంగా, "ఆ క్షణం కోసం ఆగలేక పోతున్నాను కియానీ. ఒక్కసారి నేను, నా సైన్యంతో కలకత్తా చేరుకోగలిగితే ఇక మన సైన్యాన్ని ఆపటం ఎవరి తరమూ కాదు. ఊరుఊరుకూ మన సైన్యంలో చేరే వారు పెరుగుతారు. ఆ మాటకు వస్తే అసలు బ్రిటిషు సైన్యంలో సైన్యం అంటూ మిగలదు. వాళ్లు కూడా మన వైపు వచ్చేస్తారు. ఢిల్లీని వశం చేసుకోవాలన్న మన లక్ష్యాన్ని ఎవరూ ఆపలేరు..." అన్నాడు.

"ఏమీ అనుకోనంటే ఒక సందేహం... మీరు ఎప్పుడూ ఒకసారి మన సైన్యం కలకత్తా చేరితే ఎదురు ఉండదని అంటుంటారు. అలా ఎందుకు? ముందుగా మనం ఇంఫాల్, కొహిమా చేరుకుంటాం. అవి కూడా ఇండియాలో భాగమే కదా! అక్కడి ప్రజలు మీకు సహకరించరనుకుంటున్నారా?"

"సహకరించక పోవటం కాదు కియానీ. మనం ఇంఫాల్ వద్ద ఇండియాలోకి ప్రవేశిస్తే, అస్సాం చేరే వరకు ఉన్న ప్రదేశాలన్నీ పర్వతాలు, అరణ్యాలు. ఇక్కడ రకరకాల తెగలు ఉన్నాయి. రకరకాల భాషలు ఉన్నాయి. ఒక జాతి పేరుతోనో, ఒక దేశం పేరుతోనో వీరు ఎంతగా ఏకీకృతమవుతారో నాకు తెలియదు. అదే ఒకసారి అస్సాం ప్రవేశించామంటే మైదాన ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాం. అక్కడ మనకు ప్రజాదరణ దొరుకుతుంది. ఇక కలకత్తా చేరామంటే మనకు ఎదురే ఉండదు."

"మీరు అనుకున్నట్లే జరగాలని అందరం మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం సార్..." అన్నాడు కియానీ.

అతని పేరు అచింత్. కోహిమా వచ్చి రెండు రోజులవుతోంది. ఆజాద్ హింద్ ఫౌజు తరుపున గూఢచర్యం చేయటానికి ఇండియాకి పంపిన వారిలో అతను ఒకడు.

బర్మా నుండి సుభాస్ సైన్యం ఇండియాలోకి రావాలంటే ముందు రావలసింది ఇంఫాల్ కానీ, కోహిమా కానీ. అందుకని అక్కడి పరిస్థితులు పరిశీలించి రిపోర్ట్ చేయటానికి వచ్చాడు అచింత్.

అతనికి ముందు నుండి కోహిమాలో పరిచయాలున్నాయి. లెప్రసీ చర్చ్ రోడ్డులో అతని మిత్రుడు ఒక బేకరీ నడుపుతున్నాడు. అది ఆ పట్టణంలో పేరు మోసిన బేకరీ. అతను కేవలం అచింత్ మిత్రుడే కాదు, బ్రిటిషు వారంటే అతనికి

కూడా ద్వేషం ఉంది. అందుకే అచింత్‌కి సహకరించటానికి వెంటనే ఒప్పుకున్నాడు. బేకరీ పైన ఉన్న ఒక గదిని అచింత్ ఉండటానికి ఇచ్చాడు. ఆ బేకరీలో తయారు చేసిన పదార్థాలను సైకిల్ మీద పెట్టుకుని అమ్మే నెపంతో ఊరంతా తిరుగుతూ పరిసరాల మీద అవగాహన పెంచుకుంటున్నాడు అచింత్.

కొహిమాలో ఉన్న బ్రిటిషు దళాల సంఖ్య, పాటవం తెలుసుకుని... ఆ వివరాలను వీలయినంత త్వరగా ఆజాద్ హింద్ ఫౌజుకు తెలియచేయటం అతని పని.

అతను బేకరీలో తయారయిన వస్తువులు అందించే వారిలో బ్రిటిషర్లు కూడా ఉన్నారు. అలా అందచేస్తున్నపుడు వారు మాట్లాడుకుంటున్న మాటలు, తను వెళ్లే ప్రదేశాలలో కదులుతున్న వాహనాలు గమనిస్తూ అతను సమాచారాన్ని క్రోడీకరించుకుంటున్నాడు.

కోహిమాలో ప్రస్తుతం ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ ఉందని, దానిలో 5000 మంది సైనికులు ఉన్నారని, వారికి నాయకత్వం వహిస్తోంది సర్ మాంటేగ్ స్టాఫర్డ్ అని అతను తెలుసుకున్నాడు.

రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత కోహిమాలో తను ఉంటున్న ప్రదేశానికి బాగా దూరంగా ఉన్న ఒక పాడుబడిన భవనం దరిదాపుల్లోకి చేరుకున్నాడు.

తన వీపుకు కట్టుకున్న రేడియో పరికరాలను విప్పి కింద పెట్టి, తాను ముందే రాసుకుని తెచ్చుకున్న సందేశాన్ని మోర్స్ కోడులో పంపసాగాడు.

అతను రేడియో సందేశం పంపటం మొదలు పెట్టిన సెకన్లలో బ్రిటిషు సైన్యంలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాల వారికి ఎవరో రేడియో సందేశం పంపుతున్నారని అర్థమయింది. ఆ సందేశం ఎక్కడ నుండి పంపుతున్నారో తెలుసుకునే పనిలో పడ్డారు వారు.

అచింత్ తన సందేశం పంపటం ముగించి రేడియో సెట్ వీపుకు కట్టుకుని వేగంగా ఆ భవనం నుండి బయట పడ్డాడు.

అతను అక్కడ నుండి వెళ్ళి పోయిన పావు గంటకు బ్రిటిషు కౌంటర్ ఇంటెలిజెన్స్ సైనికులు అక్కడకు చేరుకున్నారు.

సందేశం ఎక్కడ నుండి పంపారో ఖచ్చితంగా తెలుసుకోవాలంటే సందేశం పంపే వ్యక్తి రేడియోని ఎక్కువ సేపు ఆన్ చేసి ఉంచాలి. అందుకే అచింత్ తన సందేశాన్ని క్లుప్తంగా రాసుకోవటమే కాకుండా, వేగంగా పంపటం కూడా ముగించి అక్కడ నుండి వెళ్ళి పోయాడు. ఆ కారణంగా రేడియో సందేశం ఏ ఏరియా నుండి వెళ్లిందో తెలిసిందో తప్ప ఖచ్చితంగా ఏ ఇంటి నుండి వెళ్లిందో బ్రిటిషు ఇంటెలిజెన్స్ వర్గాలకు తెలియలేదు.

అయినా పరిసరాలన్నీ జల్లెడ పట్టిన వారు ఎట్టకేలకు ఆ సందేశం పాడుబడిన బిల్డింగ్ నుండి వెళ్ళి ఉంటుందని ఊహించారు. అక్కడ 24 గంటలు మఫ్టీలో కాపలా పెట్టాలని నిర్ణయించుకున్నారు.

అచింత్‌కు తన వెనుక ఏం జరిగిందో తెలియక పోయినా, ఇలానే జరుగుతుందని మాత్రం తెలుసు. అతనికి ఇచ్చిన శిక్షణలో చెప్పిన మొదటి పాఠం ఒకటే – ఒకసారి సందేశం పంపిన పరిసరాలకు మళ్లీ వెళ్లకూడదని.

అచింత్ ఆ పొరపాటు చేయడు కూడా.

అతను కోడ్ లాంగ్వేజిలో పంపిన సందేశం సింగపూరులోని ఆజాద్ హింద్ ఫౌజు హెడ్‌క్వార్టర్స్‌తో పాటు, బ్రిటిషు కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా రిసీవ్ చేసుకున్నాయి. అయితే ఒన్ టైమ్ కోడ్ ద్వారా పంపిన ఆ సందేశాన్ని బ్రేక్ చేయటం అంత తేలిక కాదు. అందుకే అతను పంపిన సందేశంలో ఏమున్నదో మాత్రం బ్రిటిషు వారు తెలుసుకోలేక పోయారు.

కలకత్తాలోని ఫోర్ట్ విలియమ్స్ లో మిలటరీ హెడ్‌క్వార్టర్ ఉంది.

శత్రు దుర్బేధ్యంగా నిర్మించిన ఆ కోట నిర్మాణం 1696 లో మొదలయింది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ నుండి పర్మిషన్ తీసుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ ఈ కోటను నిర్మించుకుంది.

1706 నాటికి హుగ్లీ నది ఒడ్డున నిర్మించిన కోట నిర్మాణం పూర్తయింది.

1756 లో నవాబ్ సిరాజుద్దౌలా బ్రిటిషు వారి మీద దండెత్తి వచ్చి కోటని, కలకత్తాని తన స్వాధీనంలోకి తీసుకుని నగరం పేరు ఆలీనగర్‌గా మార్చాడు.

మొదటి ప్లాసీ యుద్ధంలో నవాబు మీద గెలిచిన రాబర్ట్ క్లైవ్ తిరిగి కోటను కలకత్తాను గెలుచుకున్నాడు. కోటను పటిష్టం చేసే పనులు మొదలు పెట్టి 1781 లో పూర్తి చేశాడు. రెండు కిలోమీటర్ల పొడవు, కిలోమీటరు వెడల్పు ఉండే ఈ కోట అప్పటి నుండి ఇప్పటి వరకు మిలటరీ ఆధ్వర్యంలో ఉంది. అప్పట్లో బ్రిటిషు ఆర్మీ కమాండ్ సెంటర్‌గా పనిచేసిన కోట, ఈస్టర్న్ కమాండ్ హెడ్‌క్వార్టర్‌గా ఇప్పటికీ సేవలు అందిస్తోంది.

బ్రిటిషు కమాండ్‌లో కౌంటర్ ఇంటెలిజెన్స్ యూనిట్ హెడ్‌గా పనిచేస్తున్నాడు కలనల్ వార్నర్. అతని పని బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న విప్లవకారులను ఏరివేయటం. వారికి సహకారం అందిస్తున్న రాజకీయ నాయకులను జైలుకు పంపటం.

కలకత్తా కేంద్రంగా పనిచేస్తున్న అతని ఆధ్వర్యంలో బెంగాలు, బీహారు, ఒరిస్సా ప్రాంతాలు మాత్రమే కాక ఈశాన్య భారతంలోని ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతాలలో ఉన్న విదేశీ గూఢచారులను గుర్తించటం, మట్టుపెట్టటం అతని పని.

అతని కెరీర్‌లో వైఫల్యం అంటూ ఏదన్నా ఉందంటే అది అతని కళ్ళ ముందు నుండి తప్పించుకుని బోస్ దేశం విడిచి పారిపోవటం. తరువాత కూడా బోసు బ్రిటిషు ప్రభుత్వ సీక్రెట్ ఏజెంట్ల కళ్లు కప్పి జర్మనీ చేరటాన్ని అతను తనకు చేసిన అవమానంగా భావిస్తాడు. జపాను వారితో చేతులు కలిపిన బోస్ ప్రస్తుతం సింగపూరులో కూర్చుని, తమ మీద

దండయాత్రకు సన్నాహాలు చేసుకుంటున్నాడని వార్నర్‌కి తెలుసు. అంతే కాదు బోస్ దాడి చేయటం అంటూ జరిగితే, అది బర్మా మీదగా ఈశాన్య భారతం నుండి మాత్రమే జరుగుతుందని కూడా అతనికి తెలుసు

**(కొనసాగింపు వచ్చే నెలలో)**

COMMENTS